# శ్రీసాధనాల జోగారావుగారు

ఓంశ్రీసాయిరాం

ఈ పుట్టపర్తి కుగ్రామము. ఈ గ్రామము యింతటి స్థాయికి రావటానికి కారణమేమిటని ఎవరికివారు యోచించుకోవచ్చు. ఇది ఒక యోగమనిగాని, ఇది ఒక త్యాగమనిగాని, ఇది ఒక అదృష్టమనిగాని భావించరాదు. ఇది కేవలము మానవునియొక్క సంకల్పసిద్ధులే. పవిత్రమైన సంకల్పమే పవిత్రమైన దానిని సిద్ధింపజేస్తుంది.

ప్రేమస్వరూపులారా!

ప్రశాంతినిలయమందు మీకు తగిన వసతులు లేకపోయినప్పటికీ, ఎన్నియో సుఖములు అనుభవించే శ్రీమంతులు వచ్చినప్పటికీ ఇక్కడ అన్నివిధముల సవరించుకొని జీవించటానికి తగిన ఉపాయము ఒక యోగము ఏర్పడింది. ఇది ఒక సాధనగా మనము భావించాలి. సర్వసుఖములు వున్న సాధన కానేరదు. ఈ కష్టములనుండే సుఖము మనకు లభిస్తుంది. కష్టములు లేకుండా ఫలము మనకు లభించదు. ఈ కష్టములను ఒక తపస్సుగా మనం మార్చుకోవాలి. సుఖములో తమస్సు పెరుగుతుందిగాని తపస్సు పెరగదు. ఇన్ని శ్రమలకు మీరు ఓర్చుకొని ఇన్ని లక్షలమంది ఈ ప్రదేశములో యిమిడి ఉంటున్నారంటే ఇదే ఏకత్వానికి చిహ్నము.

ఐతే ప్రతిదానికి పురుషప్రయత్నము అత్యవసరము. పురుష ప్రయత్నము లేక ఏ చిన్న కార్యము మనము సాధించలేము. ఇరవై సంవత్సరముల నుండి వచ్చే వేలాది భక్తులకు తగిన అనుకూలములు ఏర్పరిచి అనేకవిధములుగా శ్రమలకోర్చి ప్రశాంతినిలయము యొక్క రూపనామములనే మార్చిన వ్యక్తి జోగారావు. 20 సంవత్సరములనుండి సత్యసాయి సెంట్రల్ ట్రస్టులోనుండి తాను రాత్రింబవలు శ్రమలకోర్చి దీని అభివృద్ధికి తగిన పాటుపడినాడు. ఇతను కర్మయోగి. కర్మయందే అతనికి చాలా ఆనందము. అందులో ఈ సంవత్సరమునుండి ఈ ఏర్పాట్లు గురించి అతను పడిన శ్రమ నాకు మాత్రమే తప్ప ఎవరికి తెలియదు. ఇతను కల్నల్ జోగారావు. 'కర్మయోగి' అంటాను నేను. ఇలాంటి జోగారావుకు ఒక నెలనుండి రాత్రి నిద్ర లేదు. అతని వయస్సు 82 సంవత్సరములు. ఇతను ఈవిధముగా శ్రమపడటంచేత ఈనాడు యిన్ని సదుపాయములకు భక్తులు నోచుకోగలిగారు. అట్టి జోగారావుకు సెంట్రల్ ట్రస్టు తరఫున అందరూకూడా ఒక అభినందనమును అందించటానికి ప్రయత్నించారు. ఈ జోగారావును కేవలం పరాయివాడని మనం భావించరాదు. కాని, ఎవరెవరి కర్తవ్యము వారు నిర్వర్తించాలి. సెంట్రల్ ట్రస్టు సంకల్పాన్ని నిర్వర్తించే నిమిత్తమై అతనికి ఈ గౌరవము అందించటానికి నిర్ణయించాము.

ఇలాంటి కర్మజీవులు, ఇలాంటి కర్మయోగులు భారతదేశమందు ఎందరో అభివృద్ధిగాంచాలి. ప్రతి వ్యక్తీ కర్మయోగిగా మారాలి. ఆ కర్మయే ధర్మంగా మారుతుంది. ఆ ధర్మమే జన్మమును సార్థకము గావిస్తుంది. దైవభావమును హృదయమందుంచుకొని కర్మయోగములో మనము మునిగి దివ్యమైన జీవితమును ధన్యముగావించుకోటం ప్రతి వ్యక్తి కర్తవ్యమని విశ్వసించాలి.

సత్యసాయి విద్యాగిరి,

23. నవంబరు, 1990.